సాక్షి
వైఎస్సార్ జిల్లా
సోమవారం । 24 । ఏప్రిల్ । 2023



వైభవోపేతంగా అక్షయ తదియ

పుష్పగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అక్షయ తదియ ఉత్సవం వైభవంగా జరిగింది. -8లో..



కడప జట్టు ఘన విజయం

కడపలో నిర్వహిస్తున్న ఏసీఏ-సౌత్‌జోన్ సీనియర్ మెన్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్‌లో కడప జట్టు విజయం సాధించింది. -8లో..



26 నుంచి గంధ మహోత్సవం

మైదుకూరు మండలం నంద్యాలంపేటలో ఈ నెల 26 నుంచి గంధ మహోత్సవం నిర్వహించనున్నారు. -8లో..

న్యూస్‌రీల్

కేజీబీవీల్లో ప్రవేశాలకు గడువు పెంపు

కడప ఎడ్యుకేషన్: కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో(కేజీబీవీ) ప్రవేశానికి ఈ నెల 30వ తేదీ వరకు గడువు పెంచారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 17 కేజీబీవీల్లో 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు. 7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్లకు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. 6వ తరగతికి 680 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరానికి 680 సీట్లు ఉన్నాయి. 7వ తరగతికి 41, 8వ తరగతికి 20, 9వ తరగతికి 19 సీట్లు ఖాళీగా ఉన్నట్లు సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఇందులో బడిబయట పిల్లలు, బడి మానేసిన వారు, అనాథలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

నేడు మహిళలకు మెగా జాబ్ మేళా

కడప కార్పొరేషన్: కడపలోని స్విస్ట్ కళాశాలలో ఈనెల 24వ తేది సోమవారం నిరుద్యోగ మహిళలకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొప్పర్తి పారిశ్రామిక వాడలో ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీ ఏఐఎల్ డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగావకాశాల కోసం ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ చదివిన వారు తమ ఆధార్ కార్డు, మార్కులలిస్టు, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్ వెంట తీసుకొని ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఐటీఐ, డిప్లమో, బీటెక్ చదివిన నిరుద్యోగ యువకులు కూడా జాబ్‌మేళాకు హాజరు కావచ్చన్నారు. అభ్యర్థులకు 19-32 ఏళ్ల లోపు వయసు ఉండాలన్నారు.జీతం రూ.11వేల నుంచి రూ.16వేల వరకూ ఇస్తారని, అటెండెన్స్ బోనస్ రూ.1000 ఇస్తారన్నారు. భోజనం, బస్సు సౌకర్యం ఉచితమని, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు ఉన్నాయని తెలిపారు.

30న సాహితీ సదస్సు

కడప కల్చరల్ : నెలనెల రాయలసీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా ఈనెల 30న సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సాహితీ సదస్సు నిర్వహించనున్నామని బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఉదయం 10.00 గంటలకు సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ఇందులో భాగంగా చిన్న లక్ష్మిసుబ్బన్న జీవితం-సాహిత్యం అంశంపై ప్రొద్దుటూరుకు చెందిన విశ్రాంత ఉపన్యాసకులు డాక్టర్ లక్ష్మి కళావతి ప్రసంగించనున్నట్లు తెలిపారు.

నేడు ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా

కడప కోటిరెడ్డిసర్కిల్ : సమస్యల పరిష్కారం కోసం సోమవారం పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రీజినల్ కార్యదర్శి రవీంద్రనాథవర్మ ఒక ప్రకటనలో తెలిపారు. కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

యోగ శిక్షణతో సంపూర్ణ ఆరోగ్యం

కడప స్పోర్ట్స్ : యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి కడప నగరంలోని వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో యోగా హాలును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో యోగా శిక్షణ నిర్వహిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఎస్ఏ చీఫ్ కోచ్ అమృత రాజ్ మాట్లాడారు. యోగా శిక్షణ గురించి శిక్షకులు పెంచల ప్రసాద వివరించారు. కార్యక్రమంలో వైద్యులు ఎస్.మురళి, ప్రశాంతి పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ అడవిలో మొక్కలపై పరిశోధన


బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని హార్సిలీ హిల్స్ అడవిలో ఆదివారం తిరుపతి ఎస్‌వీయూకు చెందిన పరిశోధక విద్యార్థులు మొక్కలపై పరిశోధనలు నిర్వహించారు. దట్టమైన, వివిధ జాతులకు చెందిన మొక్కలు, వృక్షాలకు ఈ కొండ పెట్టింది పేరు. గతంలో అంతరించిన ఓ మొక్కను కూడా ఇక్కడే కనిపెట్టారు. ఇందులో భాగంగా మొక్కశాస్త్ర పరిశోధకులు మిట్టా మహేంద్రనాథ్, మధుసుధాకర్, వృక్షశాస్త్ర విద్యార్థి మహేష్ ఈ పరిశోధనకు వచ్చారు. వీరు ఆదివారం పగలంతా అడవిలో మొక్కలను పరిశీలించారు. కొన్ని మొక్కల కొమ్మలను తీసుకొచ్చి వాటి గుణగణాలను శోధించి వివరాలను నమోదు చేశారు. ఈ మొక్కల గురించి మరిన్ని వివరాలు సేకరిస్తున్నట్టు మిట్టా మహేంద్రనాథ్ చెప్పారు. 2017లో 125 ఏళ్ల క్రితం అంతరించిపోయిన మొక్కల జాబితాలోని డిప్లోసెంట్రమ్ రికర్వమ్ మొక్క అవశేషాలను హార్సిలీహిల్స్ అడవిలోనే గుర్తించామన్నారు.

చిరుధాన్యం.. ఆరోగ్యభాగ్యం

- ప్రజా పంపిణీ ద్వారా సిరి ధాన్యాలు
- కార్డుదారులకు రాగులు, జొన్నలు
- 'సీమ' కరువు రైతులకు ఎంతో మేలు



సాగులో ఉన్న రాగి పంట



కడప సెవెన్‌రోడ్స్ : దారిద్ర్యరేఖ దిగువన ఉన్న కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యానికి ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలైన రాగులు, జొన్నలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ దిశగా ఇప్పటికే పలు చర్యలు చేపట్టింది. ప్రజా ఆరోగ్యం, పర్యావరణం మెరుగుపడడమే కాకుండా రాయలసీమ లాంటి కరువు ప్రాంతాల్లోని చిన్న, సన్నకారు రైతులకు ఇది ప్రయోజనకారిగా ఉండబోతోంది. అందుకే పౌరసరఫరాల అధికారులు నిర్వహించిన సర్వేలో ప్రభుత్వ నిర్ణయం పట్ల 90 శాతం ప్రజల మద్దతు లభించింది. కాగా, కేంద్రం ప్రకటించిన ఎంఎస్‌పీ కంటే మార్కెట్‌లో ఎక్కువ ధర రైతులకు లభించడం వల్ల ప్రొక్యూర్‌మెంట్ అనివార్యంగా ఆలస్యమవుతోంది.

ఐక్యరాజ్య సమితి 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రాగి, జొన్నలను ప్రజా పంపిణీ ద్వారా బియ్యం కార్డుదారులకు అందించాలని నిర్ణయించింది. ఒక్కోకార్డుకు రెండు కిలోల రాగులు లేదా జొన్నలు ఏది కోరుకుంటే అది ఇవ్వనున్నారు. ఈ మేరకు బియ్యంలో రెండు కిలోలు తగ్గించి ఇస్తారు. జిల్లాలో 1239 చౌక దుకాణాలు ఉండగా అందులో 5,40,496 నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ (ఎన్ఎఫ్ఎస్ఏ) కార్డులు, 36,361 రాష్ట్ర ప్రభుత్వ కార్డులు ఉన్నాయి.

ప్రభుత్వ నిర్ణయానికి జనామోదం

ప్రజలు రాగులు, జొన్నలు తీసుకుంటారో లేదో తెలుసుకోవడానికి పౌరసరఫరాల అధికారులు జిల్లాలో సర్వే నిర్వహించారు. జిల్లాలో 36 మండలాలు ఉండగా, ఒక్కో మండలంలో ఐదు ఎఫ్‌పీ షాపులు చొప్పున, ఒక్కో షాపు పరిధిలో 20 మంది కార్డుదారుల అభిప్రాయం తెలుసుకున్నారు. అంటే ఒక్కో మండలంలో 100 మంది చొప్పున జిల్లాలో 180 ఎఫ్‌పీ షాపుల పరిధిలో 3600 మంది అభిప్రాయాన్ని సేకరించారు. వీరిలో 90 శాతం మంది ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించారు.

పెరిగిన ఆరోగ్య స్పృహ

కరోనా ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెంచింది. దీంతో చిరుధాన్యాల వినియోగం వైపు మళ్లుతున్నారు. వీటిలో జింక్, ఐరన్, క్యాల్షియం లాంటి సూక్ష్మ పోషకాలు పుష్కలంగా ఉంటాయి. హై న్యూట్రిషినల్ వాల్యూ, హైఫైబర్ కంటెంట్ ఉంటాయి. బ్లడ్ షుగర్‌ను నియంత్రిస్తాయి. ఒబెసిటీ, కార్డియో వాస్క్యులర్ సమస్యల నివారణకు ఉపయోగపడతాయి. అందుకే ప్రభుత్వ పథకానికి మద్దతు లభించింది.

ధరల వ్యత్యాసంతో ప్రొక్యూర్‌మెంట్ ఆలస్యం

ప్రధాని అధ్యక్షతన జరిగిన కేబినెట్ కమిటీ ఆన్ ఎకనమిక్ అఫైర్స్ సమావేశంలో 2022-23 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జొన్న, రాగికి కనీస మద్దతు ధర ప్రకటించారు. హైబ్రిడ్ జొన్న క్వింటాలు రూ. 2970, మాల్‌దండి రకం క్వింటాలు రూ. 2990 చొప్పున నిర్ణయించారు. గతేడాది ప్రకటించిన ఎంఎస్‌పీ కంటే 8.5 శాతం ఎక్కువని కేంద్రం తెలిపింది. అలాగే రాగి కనీస మద్దతు ధర క్వింటాలు రూ. 3578లుగా ప్రకటించారు. గతేడాదితో పోలిస్తే రూ. 201 అంటే 6.0 శాతం అదనమని ప్రభుత్వం చెప్పింది. దీంతో జిల్లా పౌరసరఫరాల అధికారులు కర్ణాటక నుంచి రాగిని సేకరించేందుకు ప్రయత్నించారు. అయితే అవి నాసిరకంగా ఉండడంతో విరమించుకున్నారు. జిల్లాలో జొన్న 19 మెట్రిక్ టన్నులు సేకరించారు. ఈలోపు మార్కెట్‌లో జొన్న (మహీంద్ర మిల్క్ వైట్) క్వింటాలు ధర రూ. 3600లకు పెరిగింది. దీంతో రైతులు జొన్నను బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకుంటున్నారు. దీంతో అనివార్యంగా రాగి, జొన్న సేకరణకు తాత్కాలిక అవరోధం ఏర్పడింది.

కరువు రైతులకు బాగు....మిల్లెట్స్ సాగు

హరిత విప్లవం వరికి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం వల్ల మిల్లెట్స్ సాగు గణనీయంగా పడిపోయింది. గత ఖరీఫ్‌లో జొన్న కేవలం 5046 ఎకరాలు, రాగి 45 ఎకరాల్లో సాగు కావడం ఇందుకు నిదర్శనం. వరికి పెట్టుబడులు భారీగా ఉండడం వల్ల రైతులు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. కానీ మిల్లెట్స్ సాగుకు నీటి వినియోగం తక్కువగా ఉండడం వల్ల భూగర్భ జలాల ఓవర్ ఎక్స్‌ప్లాయిటేషన్ ఉండదు. ఖరీఫ్‌లో వర్షాధారం కింద సాగు చేసుకోవచ్చు. ఎరువులు, పురుగు మందుల అవసరం దాదాపు ఉండదు. పెట్టుబడి చాలా తక్కువ. భూసారం దెబ్బతినదు. రాయలసీమ లాంటి కరువు ప్రాంత రైతులకు మిల్లెట్స్ సాగు ఎంతో ప్రయోజనకారి.

ప్రోత్సాహకాలు అవసరం

రాష్ట్ర ప్రభుత్వం పీడీఎస్ ద్వారా చిరుధాన్యాలు పంపిణీ చేయాలని నిర్ణయించడం, పాఠశాల విద్యార్థులకు రాగి జావ ఇవ్వడం ద్వారా మిల్లెట్స్ సాగుకు ప్రోత్సాహం కల్పించడం ముదావహం. మధ్యాహ్న భోజనంలో కూడా ప్రవేశ పెడితే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మిల్లెట్స్ దిగుబడులు తక్కువగా ఉంటాయి గనుక అధిక దిగుబడుల వంగడాలను కనుగొనే దిశగా పరిశోధనలు సాగాలని అంటున్నారు.

సబ్సిడీలు ఇవ్వాలి



మండలంలో రబీలో కొర్ర, అంటుకొర్ర, రాగి సాగు చేస్తున్నాం. చిరు ధాన్యాల దిగుబడి తక్కువ ఉంటుంది గనుక రైతులకు ప్రభుత్వం సబ్సిడీల రూపంలో ప్రోత్సాహకాలు కల్పిస్తే సాగు విస్తీర్ణం మరింత పెరుగుతుంది. వీటితో పాటు అరికలు, సామలు, బరిగెలు వంటి చిరుధాన్యాలు కూడా పండించే అవకాశం ఉంటుంది. ఇందువల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది.

– చాగంరెడ్డి వీరనారాయణరెడ్డి, రైతు, దువ్వూరు

ఆరోగ్యానికి ఎంతో మేలు



ప్రభుత్వం రాగులు, జొన్నలు పంపిణీ చేయాలని నిర్ణయించడం చాలా మంచిది. ఎందుకంటే బీపీ, షుగర్ లాంటి రకరకాల వ్యాధులు వస్తున్నాయి. చిరుధాన్యాల ఆహారం తీసుకోవడం వల్ల ఇలాంటి వ్యాధులు రాకుండా నివారించే అవకాశం ఉంటుంది. మన పూర్వీకులంతా ఇలాంటి ఆహారాన్ని తీసుకునే ఆరోగ్యంగా జీవించారు.

– అబ్దుల్, మారుతినగర్, కడప

పట్టాలు తప్పిన విధులు

లోకోపైలెట్లకు విశ్రాంతి లేకుండా విధి నిర్వహణ



ముంబై-చెన్నై రైలుమార్గంలో నడిచే గూడ్స్‌రైలు

రాజంపేట: తెల్లదొరల కాలం నుంచి నందలూరు రైల్వే కేంద్రంలో కొనసాగుతున్న రన్నింగ్‌స్టాఫ్ క్రూసెంటర్ నుంచి లోకో పైలెట్ల విధులు పట్టాలు తప్పుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అధిక పనిగంటలతో లోకో పైలెట్లతో రైళ్లను నడిపిస్తున్నారు. విశ్రాంతి లేకుండా పరుగులు తీయిస్తున్నారు. ప్రస్తు తం నందలూరు డిపో పరిధిలో గార్డులు 20 మంది, 60 మంది డ్రైవర్లు, 80 మంది అసిస్టెంట్ డ్రైవర్లు ఉన్నారు.

అసౌకర్యాల నడుమ కొత్తడిపో..

ఎర్రగుంట్లలో కొత్తగా ఏర్పాటు చేసిన డిపో అసౌకర్యాల మధ్య నడుస్తోందని లోకోపైలెట్లు, గార్డులు, ఏఎల్‌పీలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. సరైన క్వార్టర్స్ లేవు. కాలుష్యబెడద, తాగునీటి సమస్యతో సతమతమవుతున్నామంటున్నారు. అక్కడ పనిచేసేందుకు చాలామంది సిబ్బంది విముఖత చూపుతున్నారు. డివిజన్ స్థాయి అధికారుల ఒత్తిడితో 20 మంది డ్రైవర్లు, 20 మంది అసిస్టెంట్ డ్రైవర్లు, 16 మంది గార్డులను కొత్తడిపోకు తీసుకెళ్లారు. గుంతకల్‌లో పనిచేస్తున్న ప్రొద్దుటూరుకు చెందిన ఓ డివిజన్ స్థాయి ఉన్నతాధికారి నిర్ణయాలే ఈ పరిస్థితికి కారణమని రైల్వేకార్మికవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

16 నుంచి 20 గంటల పాటు విధులు

ఉమ్మడి వైఎస్సార్ జిల్లా మీదుగా రైలు మార్గంలో నిత్యం 50 గూడ్స్ రైళ్లు పరుగులు తీస్తుంటాయి. లోకోపైలెట్, అసిస్టెంట్ లోకోపైలెట్, గార్డు కలిసి గూడ్స్‌రైలులో నందలూరు నుంచి కృష్ణపట్నం చేరుకుంటారు. అక్కడ 8గంటల విశ్రాంతి తీసుకొని మళ్లీ గూడ్స్ రైలులో నందలూరుకు రావాలి. కానీ వారిని కొత్తడిపో ఎర్రగుంట్ల వరకు వెళ్లాలని బలవంతంగా తీసుకెళతారు. అక్కడ 8 గంటల విశ్రాంతి తీసుకుని మళ్లీ గూడ్స్ రైలును నందలూరుకు తీసుకురావాలి. ఇలా 16 నుంచి 20 గంటల పాటు రన్నింగ్‌స్టాఫ్‌తో డ్యూటీ చేయిస్తున్నారు. దీనిపై ప్రశ్నించే నాథుడు కరవయ్యాడనే విమర్శలున్నాయి.

ప్రొద్దుటూరుకు ఇక శుద్ధి నీరు

- చిరకాల స్వప్నం నెరవేరింది
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



నీటి శుద్ధిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే ప్రొద్దుటూరు ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందని, ఇక నుంచి శుద్ధి నీరు సరఫరా చేయనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. రోజూ ప్రజలకు తాగునీరు ఇవ్వకపోతే 2024 ఎన్నికల్లో పోటీ చేయబోనని గత ఎన్నికల సందర్భంగా తాను ప్రకటించానన్నారు. ఇచ్చిన హామీ మేరకు రూ.120 కోట్లతో నిర్మించిన అమృత్ నీటి పథకాన్ని పూర్తి చేసి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించామన్నారు. ఆదివారం అమృత్ నీటి పథకానికి సంబంధించి మైలవరం నుంచి పైపులైన్ ద్వారా ప్రొద్దుటూరు వాటర్ వర్క్స్ వద్ద నూతనంగా నిర్మించిన నీటి శుద్ధి ప్లాంట్‌కు నీరు చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగమ్మకు పూజలు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. 15 ఏళ్లుగా ప్రొద్దుటూరు ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడేవారన్నారు. నీటి సమస్య పరిష్కరించాలని గత ప్రభుత్వ హయాంలో 48 గంటల పాటు తాను మున్సిపల్ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో దీక్ష చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సమస్యపై అప్పుడు అసెంబ్లీలో చర్చించానన్నారు. అయినా టీడీపీ ప్రభుత్వం స్పందించలేదని తెలిపారు.

జగన్ సీఎం కావడంతో సమస్య పరిష్కారం

జగన్ సీఎం కావడంతో ప్రధానమైన తాగునీటి సమస్యను పరిష్కరించుకోగలిగామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. రూ.120 కోట్లతో మంజూరైన అమృత్ నీటి పథకాన్ని వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేశామన్నారు. 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న మైలవరం నుంచి ప్రొద్దుటూరుకు నీరు తీసుకురావడం జరిగిందని, వచ్చిన నీటిని ఇక్కడి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు నీటిని సరఫరా చేయడానికి నెల రోజులు మాత్రమే సమయం పడుతుందని తెలిపారు. 99 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, ప్రజారోగ్యశాఖ ఈఈ చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, ఎంపీపీ శేఖర్ యాదవ్, మున్సిపల్ సచివాలయ కన్వీనర్లు కాకర్ల నాగేశ్వారెడ్డి, పోసా భాస్కర్, కౌన్సిలర్లు వంశీధర్‌రెడ్డి, ఇర్ఫాన్, గరిశపాటి లక్ష్మీదేవి, కమాల్ కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు బూతూరు వెంకటరామిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ఫరీద్, హిదాయత్, కరీముల్లా, చాను తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు మహర్దశ

- విద్యాభివృద్ధికి పీఎంశ్రీ వెన్నుదన్ను
- జిల్లాలో 34 పాఠశాలలు ఎంపిక
- నూతన విద్యవిధానంతో సమకూరనున్న వసతులు



పీఎంశ్రీ పథకానికి ఎంపికైన పులివెందులలోని అహోబిలాపురం జెడ్పీ హైస్కూల్

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విద్యకు పెద్దపీట వేసింది. నాడు- నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను అందంగా తీర్చిదిద్దింది. విద్యార్థుల విద్యాభివృద్ధికి అండగా నిలుస్తోంది. దీంతోపాటు జాతీయ స్థాయి పోటీకి తగ్గట్టుగా నూతన విద్యావిధానం అమలుకు శ్రీకారం చుట్టింది. విద్యా ప్రమాణాల పెంపునకు చిత్తశుద్ధితో పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం కూడా చేయూత అందిస్తోంది. ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకం కింద ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటునందిస్తోంది. పీఎంశ్రీ పథకం కింద జిల్లాలోని పలు పాఠశాలలను ఎంపిక చేసి నిధులను మంజూరు చేయనుంది. ఈ పథకంలో అయిదేళ్ల వరకు ఆర్థిక, సాంకేతిక సహకారం అందుతుంది.

జిల్లాలో 34 పాఠశాలలు ఎంపిక...

మూడంచెల ప్రక్రియ ద్వారా పాఠశాలలను ఎంపిక చేశారు. అయా బడుల్లో నిర్దేశించిన ఫార్మాట్‌లో సంబంధింత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కేంద్ర విద్యాశాఖ బృందాలు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదైన దరఖాస్తుల ఆధారంగా తనిఖీలు నిర్వహిస్తాయి. నిబంధనలకు అనుగుణంగా ఉన్న పాఠశాలలను ఎంపిక చేశారు. యూడైస్ 2021-22 విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని వీటి ఎంపిక జరిగింది. జిల్లావ్యాప్తంగా 34 పాఠశాలలను ఎంపిక చేశారు.

ప్రయోజనాలు ఇవీ...

- పీఎంశ్రీ కింద ఎంపిక చేసిన పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం నేరుగా నిధులు కేటాయిస్తుంది.
- డిజిటల్ పద్ధతిలో బోధన, ప్రయోగశాలలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తారు.
- ఉపాధ్యాయులకు శిక్షణతోపాటు ఆర్థిక, సాంకేతిక సహకారం అందుతుంది.
- నిపుణుల కమిటీ ద్వారా ఎంపిక చేసిన తరువాత ఆయా పాఠశాలకు విడతల వారీగా నేరుగా నిధులను అందజేస్తారు. ఈ నిధులతో విద్యార్థులకు అవసరమైన సాంకేతిక సాధనాలను సమకూర్చుకోవచ్చు. స్కూళ్లను పర్యావరణ అనుకూల గ్రీన్ స్కూల్స్‌గా మార్చాల్సి ఉంటుంది. పాఠశాలలో సోలార్ పానెళ్లను, ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేసుకోవాలి. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి స్వయంగా సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు పండించాలి.
- పాఠశాలలను ప్లాస్టిక్ రహితంగా మార్చాలి. పర్యావరణ పరిరక్షణకోసం సంప్రదాయ విధానాలను విద్యార్థులకు నేర్పించాలి.
- విద్యార్థుల అభ్యసన ఫలితాల నైపుణ్యాన్ని సాధించడంపై దృష్టి కేంద్రీకృతమై ఉంటుంది.
- పాఠశాలల్లో ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్ రూములు, లైబ్రరీలు, స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్, ఆర్ట్ రూము మొదలైన ఆధునిక మౌలిక సదుపాయాలు ఉంటాయి. పాఠశాల విద్య మరింత బలోపేతం అయ్యేందుకు పీఎంశ్రీ దోహదపడనుంది.

శుభపరిణామం



జాతీయస్థాయిలో వైఎస్సార్ జిల్లాలో 34 ప్రభుత్వ పాఠశాలలు పీఎంశ్రీ పథకం కింద ఎంపికయ్యాయి. భారతదేశ ప్రభుత్వం పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు, ఆధునాతనమైన బోధన పరికరాలను అందిస్తుంది. తద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందుతుంది. ఇది శుభపరిణామం.

– అంబవరం ప్రభాకర్‌రెడ్డి, జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి

విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయి



పీఎంశ్రీ పథకానికి ఎంపికైన పాఠశాలలకు మౌలిక వసతులు అందుతాయి. ముఖ్యంగా స్మార్ట్ క్లాసులు, క్రీడా సామగ్రి, లైబ్రరీ వంటివి సమకూరుతాయి. తరగతి గదుల్లో అనేక మార్పులు చోటు చేసుకుంటాయి. విద్యార్థులకు గుణాత్మక విద్య అందుతుంది. దీంతో విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయి.

– రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి

మరిన్ని వసతులు సమకూరుతాయి



నాడు- నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగుపడ్డాయి. దీంతో బడులకు వచ్చే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది.ప్రస్తుతం పీఎంశ్రీ పథకం ద్వారా ఎంపికైన పాఠశాలలకు మరిన్ని వసతులు కమకూరుతాయి. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పీఎంశ్రీ పథకం తోడ్పాటునందిస్తుంది.

– మార్తల వెంకటకృష్ణారెడ్డి, ఆర్‌జేడీ, పాఠశాల విద్య

ప్రశాంతంగా గురుకుల విద్యాలయ ప్రవేశ పరీక్ష



కడప చిన్నచౌక్ గురుకుల పాఠశాలలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న పావనమూర్తి

కడప ఎడ్యుకేషన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 12 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 5వ తరగతికి సంబంధించి 2071 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 1476 మంది ప్రవేశ పరీక్షకు హాజరుకాగా 506 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియెట్‌కు సంబంధించి 1655 మంది దరఖాస్తు చేసుకోగా 1184 మంది ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. 471 మంది గైర్హాజరయ్యారు. కడప చిన్నచౌక గురుకుల పాఠశాలను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటరావు, ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల రాష్ట్ర కార్యదర్శి పావనమూర్తి సందర్శించారు. పరీక్ష తీరును పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ప్రవేశ పరీక్షలు జరిగాయన్నారు.

వైభవోపేతంగా అక్షయ తదియ



చెన్నకేశవస్వామి ఆలయం వద్ద భక్తుల క్యూ



పూలంగి సేవలో చెన్నకేశవ స్వామి



నంది వాహనంపై వైద్యనాథేశ్వరస్వామి

- ఘనంగా పుష్పగిరి బ్రహ్మోత్సవాలు
- స్వాములకు ప్రత్యేక పూజలు
- భారీగా తరలివచ్చిన భక్తులు

వల్లూరు : పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలోని శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వాముల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం అత్యంత వైభవోపేతంగా జరిగిన అక్షయ తదియ ఉత్సవాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఎండ తీవ్రత ఎక్కువగా వుండడం కారణంగా పగటి పూట భక్తుల సంఖ్య కొంత తక్కువగానే వున్నప్పటికీ.. సాయంత్రం నుంచి భక్తుల రాక పెరుగుతూ రాత్రికి భారీగా పెరిగింది. పంచ నదీ సంగమమైన పుష్పగిరిలోని పెన్నా నదిలో సంకల్పపూర్వకంగా స్నానం చేసి అక్షయ తదియ రోజున శివ, కేశవులను భక్తితో పూజిస్తే అశ్వమేధయాగం చేసిన ఫలితం దక్కుతుందని పురాణాలు ఘోషిస్తున్నాయి. దీంతో అధిక సంఖ్యలో భక్తులు ఈ ఉత్సవాలలో పాల్గొని స్వామి వార్లను దర్శించుకుని కాయ కర్పూరాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు తలనీలాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు చెన్నకేశవ స్వామి ఎదుట తడి బట్టలతో సాష్టాంగ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఇక్కడ పితృ దేవతలకు పిండ ప్రదానం చేస్తే కాశీలో చేసినంత పుణ్యం లభిస్తుందనే ప్రగాఢ విశ్వాసంతో అనేక మంది భక్తులు బ్రాహ్మణుల ఆధ్వర్యంలో తమ పితృదేవతలకు పిండ ప్రదానం చేశారు.

కమనీయంగా చెన్నకేశవుని పూలంగి సేవ

శ్రీ చెన్నకేశవ స్వామికి పూలంగి సేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో స్వామి వారికి పట్టు వస్త్రాలు ధరింప చేసి వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ముల్లోకాల లోని సకల తీర్థాలతో పూరింపబడిన శంఖం, దైత్య నాశనాన్ని కోరే గధ, దుష్ట శక్తులను అంతమొందించే సుదర్శన చక్రాలను ధరించి అభయ హస్తంతో భక్తులను ఆశీర్వదిస్తున్నట్లున్న స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర ఆలయంలో అర్చకులు శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైద్యనాథునికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీ చక్ర సహిత కామాక్షీ అమ్మవారికి కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో మహేశ్వర రెడ్డి, పురోహితులు సుమంత్ దీక్షితులు, రాజేశ్వర శర్మ, ఉభయదారులు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

అక్షయ తదియ ఉత్సవాన్ని పురస్కరించుకుని కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి శ్రీ వైద్యనాథ స్వామిని, కామాక్షీ మాతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం ఎమ్మెల్యే పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతి స్వామిని కలసి ఆయన ఆశీస్సులను పొందారు. మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఆర్టీసీ చైర్మన్, కమలాపురం నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ సమన్వయకర్త దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డిలు శ్రీ వైద్య నాథేశ్వరస్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

ఇష్ట వాహనాలపై హరి హరులు

రాత్రి శ్రీ చెన్నకేశవస్వామి తనకు అత్యంత ప్రీతి పాత్రమైన గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామంలోని శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వరస్వాములు తమకు ఇష్టమైన నంది వాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ వెంకట శివారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పలువురు ట్రాక్టర్ల యజమానులు, ఆటోల యజమానులు వల్లూరు నుంచి పుష్పగిరి వరకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించారు. వివిధ కుల సంఘాలు, వివిధ గ్రామాల వారి ఆధ్వర్యంలో భారీగా అన్నదానం చేశారు. అరవ చెన్నారెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో ప్రసాదాలను పంపిణీ చేశారు. పలువురు దాతలు భక్తులకు దాహార్తిని తీర్చడానికై మినరల్ వాటర్‌ను, శీతల పానీయాలను, పానకంలను, మజ్జిగను పంపిణీ చేశారు. పలువురు దాతల ఆధ్వర్యంలో చెక్క భజనలు, హరికథా కాలక్షేపాలను ఏర్పాటు చేశారు.

నేడు కల్యాణోత్సవాలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటలకు శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వాములకు ముత్యాల తలంబ్రాలతో కల్యాణ మహోత్సవం జరుగుతుంది. సాయంత్రం శ్రీలక్ష్మీ చెన్న కేశవస్వామికి శ్రీదేవి, భూదేవితో ముత్యాల తలంబ్రాల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. అనంతరం స్వామి వారికి ఊంజల్ సేవ జరుగుతుంది.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

లక్కిరెడ్డిపల్లి : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆదివారం ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. లక్కిరెడ్డిపల్లి చింతకుంటపల్లి మార్గంమధ్యలోని చర్చి వద్ద బైక్ ఢీకొనడంతో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. లక్కిరెడ్డిపల్లి నుంచి నిఖిల్ కాలినడకతో చింతకుంటపల్లెలోని తమ ఇంటికి వెళ్తుండగా వేంపల్లి వైపు నుంచి వస్తున్న స్కూటర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి.

ఆటో బోల్తా పడి..

మదనపల్లె : ఆటో బోల్తాపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన బి.కొత్తకోట మండలంలో జరిగింది. పీటీఎం మండలం రాపూరివారిపల్లెకు చెందిన కాయలవాండ్లపల్లెకు చెందిన కె.సుబ్బన్న(58) రంగసముద్రం నుంచి బి.కొత్తకోటకు ప్యాసింజర్ ఆటోలో బయలుదేరాడు. మార్గంమధ్యలో బి.కొత్తకోటకు సమీపంలో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సుబ్బన్న తీవ్రంగా గాయపడ్డాడు.

పెన్నాలో యువకుడి మృతి



సూరజ్ మృతదేహం

జమ్మలమడుగు రూరల్ : ముద్దనూరు రహదారిలో ఉన్న పెన్నానదిలో ఈత కోసం వెళ్లి సూరజ్ (23) అనే యువకుడు మృతి చెందాడు. అర్బన్ సీఐ సదాశివయ్య ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరులోని శ్రీనివాసనగర్‌కు చెందిన సూరజ్ ముగ్గురు స్నేహితులతో కలిసి గండికోటకు వచ్చారు. తిరిగి వెళ్తున్న సమయంలో స్నేహితులు వారిస్తున్నా వినకుండా.. పెన్నానదిలో ఈత కొట్టాలంటూ పెన్నానదిలోనికి దిగాడు. నీరు ఎక్కువగా ఉండటంతో కొట్టుకునిపోయాడు. స్నేహితులు సమాచారం ఇవ్వడంతో.. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఫలితం లేకపోవడంతో.. మైలవరం గ్రామం నుంచి గజ ఈతగాళ్లను రప్పించారు. వారు రాత్రి 8 గంటల సమయంలో మృతదేహం బయటికి తీశారు. మృతుడు టైర్ల కంపెనీలో గుమస్తాగా పని చేసే వాడు.

ఇరు వర్గాల ఘర్షణ

మదనపల్లె : స్థల వివాదంలో జరిగిన ఘర్షణలో ఇరు వర్గాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. గోళ్లపల్లెకు చెందిన పి.మారెప్ప(40), తన సమీప బంధువైన పెద్దకోనప్పకు స్థల వివాదం కొంత కాలంగా నడుస్తోంది. ఈక్రమంలో కోనప్ప తన కుమారుడు వెంకటరమణ, రెడ్డెప్ప, శివలతో కలిసి మారెప్పతో గొడవకు దిగాడు. ఇరువర్గాల గొడవలో మారెప్ప, పెద్దకోనప్ప కుమారుడు వెంకటరమణ(37) తీవ్రంగా గాయపడ్డారు.

పీలేరులో బంగారు, నగదు చోరీ

పీలేరు రూరల్ : బంగారు, నగదు చోరీకి గురైన సంఘటన పీలేరు పట్టణం కావలిపల్లెలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ నరసింహుడు కథనం మేరకు వివరాలిలా వున్నాయి. స్థానిక కావలిపల్లెలో నివాసం ఉంటున్న హబీబ్‌బాషా కుటుంబ సభ్యులు శనివారం రాత్రి రంజాన్ పండుగ సందర్భంగా భోజనానంతరం కుటుంబ సభ్యులు కొందరు ఇంటి వరండా, మరికొందరు ఇంటిలో నిద్రకు ఉపక్రమించారు. దుండగులు ఇంటిలోకి చొరబడి బీరువా తలపులు బద్దలు కొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం నిద్రలేచిన కుటుంబ సభ్యులు బీరువాలో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.లక్ష నగదు, ఐదు తులాల బంగారు ఆభరణలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బుల్లెట్ వాహనాలు సీజ్



సీజ్ చేసిన వాహనాల వద్ద సీఐ, పోలీసులు

కడప అర్బన్ : కడప నగరంలో అధిక శబ్దంతో నడుపుతున్న మూడు బుల్లెట్ వాహనాలను ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేశారు. కడప ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ సీతారామిరెడ్డి ఆదివారం వివరాలు వెల్లడించారు. మోటార్ వాహనాల చట్టం కింద అధిక శబ్దంతో వాహనాలు నడుపుతున్న వారిపై జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. బుల్లెట్ బైక్‌కు కంపెనీ ఇచ్చిన సైలెన్సర్‌నే వినియోగించాలని పేర్కొన్నారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి



పోటీలను తిలకిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, భారతి సిమెంట్ పరిశ్రమ ప్రతినిధులు

వల్లూరు : పుష్పగిరిలోని శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అక్షయ తదియను పురస్కరించుకుని భారతి సిమెంట్ పరిశ్రమ సౌజన్యంతో.. ఆదివారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుగులో ఏర్పాటు చేసిన ఓల్డ్ కేటగిరీ రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథరెడ్డి, పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతి, మాజీ జెడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, భారతి సిమెంట్ పరిశ్రమ ప్లాంట్ హెడ్ సాయి రమేష్ ప్రారంభించారు. వీరు మొదట కోర్టు ప్రవేశ ద్వారం వద్ద రిబ్బన్ కట్ చేసి కోర్టులోకి ప్రవేశించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దక్షిణ కాశిగా పేరొందిన పుష్పగిరి బ్రహ్మోత్సవాలకు విశేష ప్రాధాన్యత వుందని అన్నారు. ఇందులో భాగంగా భారతి సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో రైతులను ప్రోత్సహించే విధంగా బండలాగుడు పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో వుంచుకుని రాత్రి సమయంలో ఆహ్లాదకర వాతావరణంలో ఫ్లడ్ లైట్ల వెలుగులో పోటీలను ఏర్పాటు చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 11 జతల ఎద్దులు హాజరయ్యాయి. పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీలను తిలకించడానికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భారతి సిమెంట్ పరిశ్రమ వీపీ మల్లారెడ్డి, ఐఆర్ అండ్ పీఆర్ చీఫ్ మేనేజర్ భార్గవరెడ్డి, మార్కెటింగ్ చీఫ్ మేనేజర్ ఏ ప్రతాప్‌రెడ్డి, డీజీఎమ్ మల్లికార్జునరెడ్డి, నరేందర్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు ఇందిరెడ్డి శంకర్ రెడ్డి, యర్రగుడిపాడు చెన్న కేశవరెడ్డి, మురళీమోహన్ రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

26 నుంచి గంధ మహోత్సవం



నంద్యాలంపేటలోని దర్గా

మైదుకూరు : మైదుకూరు మండలం నంద్యాలంపేటలో ఈ నెల 26 నుంచి గంధ మహోత్సవం నిర్వహించనున్నారు. 26న నిషాన్, 27న గంధ మహోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రామంలోని మాతృశ్రీ ఆశ్రమంలో హజరత్ అష్రఫే దోజహో ఆరా మాసాహేబా కుడిచి, హజరత్ జహూర్ అలీషా ఖాద్రీచిష్టి వారి దర్గాలు వెలిసి ఉన్నవి. ఆ మహనీయుల కృపతో దీనజనుల దీర్ఘకాలిక రోగాలు, మానసిక బాధలు తదితరాలు తొలగిపోతున్నాయని భక్తుల నమ్మకం. మాసాహేబా కుడిచివారి గంధం శోభకృత నామ సంవత్సరం వైశాఖ శుద్ధ సప్తమి ఈ నెల 27న గురువారం ఉదయం జీవీ సత్రంలోని పఠాన్‌ఖాన్ ఇంటి నుంచి బయలుదేరుతుంది. మాసాహేబా కుడిచి, గౌస్‌లాజం దస్తగిరి, అలిముష్కిల్‌కుషా స్వాములకు సమర్పిస్తారు. జహూర్ అలీషా ఖాద్రీచిష్టి 2016 ఏప్రిల్ 27న సమాధి నిష్టా గరిష్టులైనారు. ఆ మహనీయుడు భక్తుల కోరికలు తీరుస్తూ.. వారిని రక్షిస్తున్నారు. ఆయన గంధం శోభకృత నామ సంవత్సరం వైశాఖ శుద్ధ సప్తమి ఈ నెల 27న గురువారం నిర్వహిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, ఉత్సవాలను విజయవంతం చేయాలని ప్రొద్దుటూరుకు చెందిన జహూర్ అలీషా ఖాద్రీచిష్టి కుమారులు, ఖాదర్‌పల్లెకు చెందిన మహబూబ్ హుసేన్ కుమారులు, జీవి సత్రానికి చెందిన పఠాన్ సత్తార్ ఖాన్, దొరసానిపల్లెకు చెందిన వుండేల రామభూపాల్‌రెడ్డి కోరారు.

ఇనుప పైపును ఢీకొన్న బైక్

- వ్యక్తి మృతి

ప్రొద్దుటూరు క్రైం : బైక్ అదుపు తప్పి ఇనుప పైపును ఢీకొన్న సంఘటనలో నంగనూరుపల్లెకు చెందిన వెంకటేష్ (28) అనే వ్యక్తి మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ చిరంజీవి తెలిపిన మేరకు.. వెంకటేష్ బెల్దారి పని చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఎప్పటి లాగే బేల్దారి పని చేసేందుకు వెంకటేష్ ఆదివారం ప్రొద్దుటూరు వెళ్లాడు. పని ముగించుకొని సాయంత్రం అతను బైక్‌లో గ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో రహదారిలో అతని వాహనం అదుపు తప్పడంతో పంప్ హౌస్‌కు సంబంధించిన ఇనుప పైపును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో స్థానికులు అతన్ని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

ఉపాధి కూలీ మృతి



వెంకటరమణ (ఫైల్)

చక్రాయపేట : మండలంలోని మహదేవపల్లె గ్రామం దళితవాడకు చెందిన వెంకటరమణ (42) అనే ఉపాధి కూలీ శనివారం రాత్రి మృతి చెందినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ గంగాధర తెలిపారు. రోజూ లాగే ఆయన శనివారం ఉదయాన్నే తోటి కూలీలతో కలిసి ఉపాధి పనికి వచ్చాడని చెప్పారు. మరి కొద్దిసేపటికి ఇంటికి వెళ్తామనగా.. పని చేస్తూ అస్వస్థతకు గురై కుప్పకూలిపడిపోయాడన్నారు. దీంతో బంధువులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంకటరమణ మృతదేహాన్ని చక్రాయపేట జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ రామచంద్ర సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వ సాయంగా రూ.10 వేల నగదును బాధిత కుటుంబీకులకు అందించారు.

చిత్తూరుపై కడప జట్టు ఘన విజయం



క్రికెట్ మ్యాచ్ ఆడుతున్న కడప, చిత్తూరు జట్లు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న ఏసీఏ-సౌత్‌జోన్ సీనియర్ మెన్ టీ-20 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో కడప జట్టు ఘన విజయం సాధించింది. ఆదివారం ఉదయం నిర్వహించిన మ్యాచ్‌లో కడప, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. జట్టులోని ఎస్.జహీర్ అబ్బాస్ 40 బంతుల్లో 6 ఫోర్లు, 8 సిక్సర్‌లతో చెలరేగి 93 పరుగులు చేశాడు. ఈయనకు జతగా పవన్‌కుమార్‌రెడ్డి 30 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్ మాధవ్ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. జట్టులోని పృథ్వీ రాజ్ 61 బంతుల్లో 101 పరుగులు చేశాడు. ధరణికుమార్ 26 పరుగులు చేశాడు. కడప బౌలర్ సుదర్శన్ 2 వికెట్లు తీశాడు. దీంతో కడప జట్టు 23 పరుగుల తేడాతో విజయం సాధించింది.

నెల్లూరు జట్టు జయకేతనం

మధ్యాహ్నం నిర్వహించిన మ్యాచ్‌లో నెల్లూరు, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 148 పరుగులు చేసింది. జట్టులోని ఎం.కె. రెడ్డి 64 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ సుదర్శన్ 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. జట్టులోని గిరినాథ్ 35, కమ్రుద్దీన్ 31 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్లు మాధవ్ 2, సల్మాన్ 2 వికెట్లు తీశారు. దీంతో నెల్లూరు జట్టు 4 పరుగుల తేడాతో జయకేతనం ఎగురవేసింది.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..



పోటీలను ప్రారంభిస్తున్న యార్డు డైరెక్టర్ బంగారు నాగయ్య

కడప అగ్రికల్చర్ : కడప మార్కెట్ యార్డులో రంజాన్ సందర్భంగా ఆదివారం ఒంటెద్దు బండి బండలాగుడు పోటీలను ఖాశీంవలి, రాయలసీమ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలను మార్కెట్‌యార్డు చైర్మన్ బంగారు గంగాదేవి, డైరెక్టర్లు బంగారు నాగయ్య, పల్లెంకొండు సంపత్, రామక్రిష్ణ ప్రారంభించారు. ఈ పోటీలు ఉత్సాహంగా, ఉల్లాసంగా జరిగాయి. విజేతలుగా నిలిచిన ఎద్దుల యజమానులకు బహుమతులు ప్రదానం చేశారు. రూ.పది వేల విలువ చేసే బంగారు ఉంగరం మొదటి బహుమతిని మార్కెట్‌యార్డు చైర్మన్ బంగారు గంగాదేవి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ బంగారు నాగయ్య, ఎనిమిది వేల విలువ చేసే ద్వితీయ బహుమతి వెండి గజ్జలను జాహిర్ వితరణగా ఇచ్చారు. మొదటి బహుమతిని సనావుల్ల, రెండవ బహుమతిని షేక్ రెడ్డిబాషా, మూడవ బహుమతి వాషింగ్ మిషన్‌ను షేక్ సమాధాని బాషా ఎద్దులు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు డైరెక్టర్ సుశీలమ్మ, జయశ్రీ, యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం చేస్తున్న వెంకటరాముడు

కడప అర్బన్ : కడప నగర శివారులోని చెన్నూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో పాలెంపల్లి సమీసాన ఈ నెల16న బెస్తకాలనీకి చెందిన ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అసలే నిరుపేదలు, చేతికి వచ్చిన కుమారులు మృతి చెందడంతో బాధిత కుటుంబాలు తల్లడిల్లుతున్నాయి. ఈ నేపథ్యంలో కడప రూరల్ సీఐ కె.అశోక్‌రెడ్డి చొరవతో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నివాసి ఎ.వెంకటరాముడు వారికి రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. మృతుల కుటుంబ సభ్యులు దాత వెంకటరాముడికి, సీఐ అశోక్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

సిద్దవటం కోటలో పర్యాటకుల సందడి



సిద్దవటం కోటకు వచ్చిన పర్యాటకులు



పెన్నా నదిలో ఈత కొడుతున్న ముస్లింలు

సిద్దవటం : సిద్దవటంలోని మట్లి రాజుల కోటలో పర్యాటకులు ఆదివారం రంజాన్ పండుగ సందర్భంగా రెండో రోజు వేడుకలు నిర్వహించారు. పవిత్ర రంజాన్ మాసంలో 40 రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలు శనివారం రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల నలుమూలల నుంచి ముస్లింలు కుటుంబ సభ్యులతో కలిసి సిద్దవటంలోని మట్లి రాజుల కోటలో బాసికుద్బా వేడుకలు చేశారు. అనంతరం వెంట తెచ్చుకున్న భోజనాన్ని ఆరగించారు. పెన్నానదిలో కోటలోని స్వరంగ మార్గం గుండా వెళ్లి చిన్నా, పెద్ద, మహిళలు పెన్నా నీటిలో ఈతలాడుతూ కేరింతలు కొట్టి ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.